సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 2, ఆగస్టు, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 24.358 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 837 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,380
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,512
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,677
నవర (8 గ్రా) -	రూ.45,416

గరిష్టం/కనిష్టం
35.6 /29.2

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 53 శాతం ఉంది. జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

55.49 శాతం మందికి పింఛన్ల అందజేత



నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కర్లీకాలనీకి చెందిన ఈశ్వరయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసులు

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. మొదటి రోజు మంగళవారం 55.49 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు పంపిణీ చేశారు. మొత్తం 3,03,501 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక నగదు అందజేయాల్సి ఉండగా, 1,68,416 మందికి పంపిణీ చేశారు. వేకువజాము నుంచే వలంటీర్లు పింఛన్ పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందించారు. ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న వారికి, పొలంలో ఉన్న రైతులకు, పని ప్రదేశాల్లో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి వలంటీర్లు పింఛన్ నగదు అందజేశారు. రాపూరు, నెల్లూరు, కొడవలూరు మండలాలు పింఛన్ కానుక పంపిణీలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ నగదును పంపిణీ చేయనున్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గ్రామ వ్యవసాయ సహాయకులు ఆయా గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారని, ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు వీఏఏల ద్వారా వెంటనే నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే వ్యవసాయరంగానికి సంబంధించిన సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

7 లోపు లోగోను అప్‌లోడ్ చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2వ తేదీ నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీలను ఐదు దశల్లో నిర్వహిస్తుందని సెట్నెల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.నాగరాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆటలకు సంబంధించిన లోగో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర ప్రతిష్టను ప్రతిబింబించేలా లోగా/మస్కట్‌ను తయారు చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తాము తయారు చేసిన లోగోను హెచ్‌టీటీపీ.ఎస్‌పీఓఆర్‌టీఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 7వ తేదీ లోపు అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగులకు ప్రభుత్వ రుణాలు

నెల్లూరు(దర్గామిట్ట): దివ్యాంగులు వాణిజ్య, వ్యాపార, సేవా రంగాల ద్వారా జీవనోపాధిని మెరుగు పరుచుకునేందుకు నామమాత్రపు వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన 18-60 ఏళ్ల వయసు గల దివ్యాంగులకు 40 శాతం, ఆపైన వైకల్యం గల వారికి 6 శాతం వడ్డీతో రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాన్ని 3 నుంచి 5 ఏళ్ల లోపు తిరిగి చెల్లించాలని తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం కావాల్సిన వారు లబ్ధిదారుని వాటాగా 5 శాతం సొమ్మును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు www.spsnellore.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 16వ తేదీ లోపు వనంతోపులోని సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 9949343671 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



స్వర్ణాల తీరంలో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

మదినిండా భక్తిపరవశం

బారాషహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండగకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. తమ కోర్కెలు తీరాలని స్వర్ణాల తీరంలో రొట్టెలు అందుకుంటున్నారు. మదినిండా భక్తితో దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. నాలుగో రోజు మంగళవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. దర్గా వద్ద తహలీల్ ఫాతేహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదు రోజులపాటు జరుగుతున్న రొట్టెల పండగ బుధవారంతో ముగియనుంది.

- రొట్టెల పండగకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నాలుగో రోజూ కొనసాగిన రద్దీ
- కోర్కెల రొట్టెలు అందుకున్న భక్తులు
- బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా
- నేటితో ముగింపు

సాక్షి నెల్లూరు, ప్రతినిధి/నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగ చివరి ఘట్టానికి చేరింది. గత నెల 29వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ వేడుకకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతోపాటు నగరవాసులు కూడా తరలిరావడంతో స్వర్ణాల తీరంలో భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులు దర్గాలోని షహీదుల సమాధులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. కాగా ఈ వేడుక బుధవారంతో ముగియనుంది.



దర్గాను దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా

మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న రొట్టెల పండగ ముగింపును పురస్కరించుకుని మంగళవారం తహలీల్ ఫాతేహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయంగా జరిగిన ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గంధాన్ని బిందెలో తీసుకొచ్చారు. ముజావర్లు, ఫకీర్లు, మతపెద్దలు ప్రత్యేక దువా చేసి తహలీల్ ఫాతేహా (చదివింపులు) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పవిత్ర గంధాన్ని భక్తులకు పంచారు. ఈ సందర్భంగా బారాషహీద్ దర్గా రొట్టెల పండగ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఖాదరి మాట్లాడుతూ గత ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన బారాషహీద్ పవిత్ర గంధ మహోత్సవం మంగళవారం తహలీల్ ఫాతేహాతో పరిసమాప్తమైందన్నారు. సంప్రదాయంగా బుధవారం 11 గంటలకు జరిగే ఖత్ మే జియారత్ (ముగింపు)తో రొట్టెల పండగ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో బారాషహీద్ దర్గా రొట్టెల పండగ కమిటీ ప్రతినిధులు ఇస్మాయిల్ ఖాదరి, మస్తాన్, మీరా, ఖుదావంద్, అలీ, అబ్దుల్‌వహాబ్, అహ్మద్, సందానీబాషా తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

వివాహ రొట్టెకు పెరిగిన డిమాండ్

రొట్టెల పండగలో నాలుగో రోజు మంగళవారం స్వర్ణాల ఘాట్ వద్ద వివాహ రొట్టెకు డిమాండ్ ఏర్పడింది. అవివాహితులు తమకు పెళ్లి కావాలని కోరుకుంటూ వివాహ రొట్టెలను పట్టుకునేందుకు పోటీపడ్డారు. దీంతో వివాహ రొట్టెకు డిమాండ్ పెరిగింది.



షహీద్‌ల సమాధులను దర్శించుకుంటూ..



తహలీల్ ఫాతేహా సందర్భంగా బిందెలో గంధాన్ని తీసుకొస్తున్న మత పెద్దలు, వక్ఫ్‌బోర్డు అధికారులు, రొట్టెల పండగ కమిటీ నిర్వాహకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్



భక్తుల సేవలో రెడ్‌క్రాస్ వలంటీర్లు

పరిశుభ్రతకు పెద్దపీట

దర్గా ప్రాంగణంలో ఎక్కడా అపరిశుభ్రం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ దర్గా ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నారు. దీంతో దర్గా ప్రాంగణమంతా శుభ్రంగా ఉండడంతో భక్తులు పారిశుద్ధ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ, దర్గాకు పెరిగిన ఆదాయం

రొట్టెల పండగ సందర్భంగా గత నాలుగు రోజుల్లో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. అలాగే భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో కానుకల రూపంలో దర్గాకు కూడా ఆదాయం సమకూరింది. బుధవారం వరకు రొట్టెల పండగ జరగనుండడంతో మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు చెబుతున్నారు.

వేదగిరి లక్ష్మీనరసింహస్వామికి గరుడసేవ



లక్ష్మీనరసింహస్వామికి గరుడోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గరుడసేవ, గిరిప్రదక్షిణ వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జిల్లాలో ఐదు వారాలపాటు విజయవంతంగా నిర్వహించామని, 769 సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన 5,77,374 సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలను ప్రతి గడపకు తీసుకెళ్లడంతోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందాలనే లక్ష్యంతో జూన్ 24 నుంచి జూలై 31వ తేదీ వరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని 769 సచివాయాలు, 13,744 క్లస్టర్ల పరిధిలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన 5,85,323 సర్వీసులను నమోదు చేసుకుని 5,77,374 సేవలను అందించినట్లు తెలిపారు. సరైన ఆధారాలు లేనందున 6,415 సర్వీసులను తిరస్కరించామని, మిగిలిన 1,534 సర్వీసులను ఎస్‌ఎల్‌ఏ పీరియడ్‌లో ఉన్నాయని తెలిపారు. సర్వీసుల పరిష్కారంలో 98.78 శాతం మేర లక్ష్యం సాధించామన్నారు. జిల్లాలోని మొత్తం 8,37,465 కుటుంబాలకు గాను 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 7,31,108 కుటుంబాలను కవర్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన క్యాంపుల్లో 2,55,482 మంది ప్రజలు పాల్గొన్నారని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందజేసిన ఉచిత సేవల వల్ల సుమారు రూ.2.97 కోట్ల ఆర్థికపరమైన ప్రయోజనం కల్పించినట్లు తెలిపారు. ఈకేవైసీ కోసం 4,942 అర్జీలు రాగా 4,322 పరిష్కరించామన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలోనూ, సేవలందించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. కోవూరు మండల పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నాణ్యతతో నిర్వహించినందుకు తహసీల్దారు పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, ఈఓపీఆర్‌డీ ఆదినారాయణ, డీటీ ఇలియాజ్‌ను కలెక్టర్ అభినందించారు. అలాగే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా నిర్వహించేలా కృషి చేసిన డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిని, 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించిన జెడ్పీ సీఈఓ చిరంజీవిని, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో జేసీ ఆర్.కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.



కోవూరు తహసీల్దార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

శరవేగంగా వెలిగొండ

- రికార్డు స్థాయిలో మొదటి టన్నెల్ పూర్తి
- వేగవంతంగా రెండో టన్నెల్ పనులు
- జిల్లాలో 65 వేల ఎకరాలకు సాగునీరు
- 1.5 లక్షల మందికి తీరనున్న దాహార్తి
- అక్టోబర్ నాటికి నీరందించేలా ప్రణాళిక

మెట్ట ప్రాంత మండలాలకు సాగునీరు అందించాలనే మహోన్నత ఆశయంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంకల్పించారు. ఆ సమయంలో దాదాపు 50 శాతం పనులు పూర్తయినా, ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు పనులను విస్మరించాయి. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చి పనులను శరవేగంగా పూర్తి చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, కనిగిరి, పోరుమామిళ్ల, తదితర 30 మండలాలకు సాగునీటిని అందించి ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పనులు ఊపందుకున్నాయి. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పనులను గాలికొదిలేసింది. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం వెలిగొండ నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చి పనులను వేగవంతం చేసింది. ఇప్పటికే మొదటి టన్నెల్‌ను రికార్డు స్థాయిలో పూర్తి చేసిన ప్రభుత్వం రెండో టన్నెల్‌ను శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. రెండో టన్నెల్ పూర్తయితే ఈ ప్రాంతాలకు సాగునీటికి దిగులుండదు.

43.58 టీఎంసీలను తరలించేలా..

కృష్ణా నదిపై శ్రీశైలానికి 45 రోజుల పాటు వరదొస్తుంది. ఆ సమయంలో రోజూ 11,582 క్యూసెక్కుల చొప్పున 43.58 టీఎంసీలను తరలించేలా రెండు టన్నెళ్లను తవ్వాలని దివంగత సీఎం వైఎస్సార్ నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, దర్శి, కొండపి, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో 3.36 లక్షలు.. నెల్లూరు జిల్లా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని 65 వేలు.. వైఎస్సార్ జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని 27,200.. మొత్తం 4.28 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే కాకుండా 1.5 లక్షల మంది దాహార్తిని తీర్చాలని ప్రతిపాదనలు రూపొందించారు. ఈ పనులను జిల్లాలో ఎమ్మార్కే ఆర్ – జెడ్వీఎస్ సంస్థ దక్కించుకుంది



భారీ యంత్రం సాయంతో ముమ్మరంగా చేస్తున్న వెలిగొండ టన్నెల్ పనులు

లబ్ధి పొందనున్న ప్రాంతాలు		
జిల్లా	మండలాలు	ఎకరాలు
నెల్లూరు	ఉదయగిరి, ఆత్మకూరు	65 వేలు
ప్రకాశం	యర్రగొండపాలెం, దర్శి, కొండపి, గిద్దలూరు, కనిగిరి	3.36 లక్షలు
వైఎస్సార్	బద్వేల్	27,200

ప్రాధాన్య ప్రాజెక్ట్‌గా..

గత ప్రభుత్వ హయాంలో వెలిగొండ ప్రాజెక్ట్ పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. దీంతో పనులు నత్తనడకన సాగి నిర్మాణం వెనుకబడిపోయింది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం వెలిగొండను ప్రాధాన్యత ప్రాజెక్ట్‌గా చేర్చి రెండో టన్నెల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసి రివర్స్ టెండరింగ్ ద్వారా మరొకరికి అప్పగించారు. మొదటి టన్నెల్‌ను రికార్డు స్థాయిలో 3.6 కిలోమీటర్ల పనిని 13 నెలల్లో లైనింగ్‌తో సహా పూర్తి చేశారు. రెండో టన్నెల్‌ను మరో రెండు నెలల్లో పూర్తి చేసేలా శరవేగంగా పనులు చేస్తున్నారు. రెండో టన్నెల్‌ను 18,787 మీటర్లు, 9.2 మీటర్ల వ్యాసంతో నిర్మించాల్సి ఉంది. నీటి ప్రవాహ సామర్థ్యం 8,581.3 క్యూసెక్కులు వచ్చేలా ప్రణాళికతో పనులు చేస్తున్నారు. 2022 – 23లో 5.52 కిలోమీటర్ల సొరంగం తవ్వారు. మిగిలిన 1.889 కిలోమీటర్ల పనులను సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేసి అక్టోబర్‌లో నీరివ్వాలనే సీఎం ఆదేశాలను అమలు చేసేలా పనులు చేస్తున్నారు.

బీడు భూములు కళకళ

రెండో టన్నెల్ పూర్తయ్యాక పడమటి కాలువ ద్వారా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌లో 2.510 టీఎంసీలను నిల్వ ఉంచి తద్వారా ఆ ప్రాంత భూములకు సాగునీరందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి. ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించి ఉదయగిరి మండలంలో 11 వేలు, దుత్తలూరులో 20 వేలు, వరికుంటపాడులో 13 వేలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. 1.5 లక్షల మందికి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయనున్నారు.

ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే సస్యశ్యామలం



వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం వైఎస్సార్ చిరకాల వాంఛ. ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి ఉదయగిరిని సస్యశ్యామలం చేయాలని మా సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి గత ప్రభుత్వం పైసా నిధులివ్వలేదు. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను ప్రాధాన్య క్రమంలో ఉంచి రికార్డు స్థాయిలో పనులు జరిపిస్తున్నారు. సోమశిల హైలెవల్ కెనాల్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సీతారామ్‌సాగర్ ప్రాజెక్ట్‌లు పూర్తయితే ఉదయగిరి మెట్ట ప్రాంతం కళకళగా మారనుంది. ఈ పరిస్థితిని అతి త్వరలోనే చూడనున్నాం.

మేకపాటి రాజగోపాల్‌రెడ్డి,
వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త

1,877 పొగాకు బేళ్ల కొనుగోలు



డీసీపల్లి వేలం కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగాకు బేళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 1,005 పొగాకు బేళ్ల కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. రైతులు 1,049 బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా, 44 బేళ్ల తిరస్కరించినట్లు తెలిపారు. 15 కంపెనీల బయ్యర్లు రైతుల వద్ద 1,21,840 కిలోల పొగాకును రూ.3,02,68,000 పైచిలుకు ధరతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.270, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.248.43 చొప్పున లభించిందని తెలిపారు.

కలిగిరిలో 872 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 872 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 920 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 872 బేళ్లను కొనుగోలు చేశారని, 48 బేళ్లను తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకుకు గరిష్టంగా రూ.270, కనిష్టంగా రూ.150, సగటున రూ.257.92 ధర లభించింది.

నాలుగేళ్లలో తగ్గిన పేదరికం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట : రాష్ట్రంలో గత నాలుగేళ్లలో పేదరికం ఆరు శాతం తగ్గిందని, దీనికి సంక్షేమ పథకాలే కారణమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌పేట మండలం శ్రీకొలను సచివాలయ పరిధిలోని జువ్వలగుంటపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే 69 సచివాలయాల పరిధిలో పర్యటించినట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. 2024లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారన్నారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సరిదిద్దుకుంటామన్నారు. గ్రామాల్లోని రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలను బాగు చేసేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సంధాని, తోగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పూరి ఆదిలక్ష్మి, పార్టీ నేతలు గంగిరెడ్డి, అంబవరపు కోటిరెడ్డి, రవీంద్రారెడ్డి, షబ్బీర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లపూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలు కోరిన పనుల అమలుపై నాయకులు, అధికారులతో పంచాయతీల వారీగా మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు తాగు, సాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఆరోగ్యం, ఇంటి నివేశన పట్టాలు, పక్కాగృహాలు తదితర సమస్యలను ప్రస్తావించారని, వీటి పరిష్కారానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఈ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ఏ దశలో ఉన్నాయన్న అంశాలను తెలుసుకునేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమీక్షలు నిర్వహించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి కాకాణి అన్నారు. పేద ప్రజలకు కలగా మారిన మత్స్యకారేతర ప్యాకేజీని పంపిణీ చేశామని గుర్తుచేశారు. త్వరలో మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. పొట్టెంపాడులో చుక్కల భూముల సమస్యను పరిష్కరించామన్నారు. ముత్తుకూరులో పేదల ఇంటి నివేశన స్థలాల కోసం ఆరు ఎకరాల భూములు సేకరించామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రూరల్ పరిధిలో విస్తృతంగా అభివృద్ధి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



19వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూరల్ పరిధిలో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 19వ డివిజన్‌లో రూ.32 లక్షలతో నిర్మించనున్న మూడు సీసీరోడ్లకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైతే ఈప్రాంతానికి మరో రూ.20 లక్షలు కేటాయించనున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, తాను చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల ఆనందాన్ని గమనించానన్నారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. ఎన్నికల్లోపు పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. టీడీపీ నాయకుల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరిస్తే మిగిలిన సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. విజయా డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు హరిబాబు యాదవ్, శివసునీల్‌రెడ్డి, జీపీ ప్రసాద్, లక్ష్మీనారాయణ, పచ్చా రవి, శ్రీధర్‌రెడ్డి, బుల్లయ్య, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా శివ



జిల్లా అధ్యక్షుడిగా శివను ప్రకటిస్తున్న సంఘ నేతలు

కొడవలూరు: ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ్ల శివ ఎంపికయ్యారు. మండలంలోని రామాపురంలో ఆ సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలపర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో శివను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివ మాట్లాడుతూ ఎరుకుల కులస్తులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : అనారోగ్యమో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ వివాహిత మృతిచెందిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రవీంద్రనగర్‌లో పి.జ్యోతి అలియాస్ పద్మ(45) నివాసం ఉంటున్నారు. ఆమెకు మద్యం, గుట్కాల అలవాటు ఉంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గత నెల 31వ తేదీ రాత్రి ఆమె తన ఇంటి ముందు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వీఆర్వో మీరయ్యకు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆమె స్పృహలో లేదు. దీంతో ఆయన 108కు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని జ్యోతిని పరిశీలించగా అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. ఈమేరకు వీఆర్వో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ఆమె కుటుంబసభ్యులు, బంధువుల కోసం ఆరా తీస్తున్నారు.

మద్యం మత్తులో..

నెల్లూరు(క్రైమ్) : మద్యం మత్తులో ఊపిరాడక ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వందన హోటల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గూడూరుకు చెందిన షేక్ అబూబకర్(38), నాజియ దంపతులు. అబూబకర్ మద్యానికి బానిసై భార్య, పిల్లలను వదిలేసి నెల్లూరులో తిరగసాగాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అయ్యప్పగుడి వద్ద వందన హోటల్ సమీపంలో ఆయన మద్యం మత్తులో మూలుగుతూ కొద్దిసేపటికి మృతిచెందినట్లు స్థానికులు వీఆర్వో ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిస్తుండుగా గూడూరుకు చెందిన ఫయాజ్ అటుగా వెళ్తూ మృతుడు అబూబకర్ అని, అతని కుటుంబ వివరాలను వీఆర్వోకు తెలియజేశారు. ఆయన ద్వారా మృతుని భార్యకు ఫోన్‌చేసి విషయాన్ని చెప్పగా తనకు సంబంధం లేదని, తాగుడు కారణంగానే చనిపోయి ఉండవచ్చని ఆమె చెప్పింది. ఈమేరకు వీఆర్వో ప్రసాద్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	133
లేయర్ (లైవ్)	88
బ్రాయిలర్ చికెన్	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	256
లేయర్ చికెన్	150

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.25
సన్నవి	రూ.15
పండ్లు	రూ.5

జామాయిల్ కర్రకు గిరాకీ

జామాయిల్ కర్రకు ప్రస్తుతం గిరాకీ ఏర్పడింది. గతంలో దళారుల మోసాలు, కంపెనీలు సైతం ధరల తగ్గించడం వంటి కారణాలతో రైతులు జామాయిల్, సరుగుడు, సుబాబుల్ సాగును తగ్గించారు. దీనివల్ల ప్రస్తుతం ఒక్కసారిగా కర్రకు డిమాండ్ ఏర్పడింది. పేపర్ పరిశ్రమల డిమాండ్‌కు తగ్గట్లు కర్ర సరఫరా లేకపోవడంతో ధరలు పెంచేశారు.

- టన్నుకు రూ.3,700 ఇస్తున్న వ్యాపారులు
- ధరలు మరింత పెరిగే అవకాశం
- డిమాండ్‌కు తగ్గట్లు నరుకు దొరకని పరిస్థితి



జామాయిల్ తోట

కందుకూరు: జిల్లాలో 29,655 హెక్టార్లలో కర్ర సాగు ఉంది. 22,045 హెక్టార్లలో జామాయిల్, 7,415 హెక్టార్లలో సరుగుడు, 195 హెక్టార్లలో సుబాబుల్ సాగు ఉంది. ఇవి అధికంగా కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు ప్రాంతాల్లో సాగు ఉండగా, మిగిలిన నియోజకవర్గాల్లో తక్కువగా ఉంటుంది. అయితే అధికారుల అంచనా ప్రకారం ఇటీవల కాలంలో సాగు పెద్ద మొత్తంలో తగ్గిందని, దాదాపు 1000 హెక్టార్ల వరకు పంట మార్పిడికి రైతులు వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ప్రధానంగా జామాయిల్ కర్రకు పేపర్ పరిశ్రమల నుంచి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా నెల్లూరు, ప్రకాశం జిల్లాలో సాగయ్యే కర్ర నాణ్యత బాగుండడంతో ఐటీసీతో పాటు ఇతర కంపెనీలు ఇక్కడి నుంచి కర్రను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రెండు వేల టన్నులు కూడా కష్టం

మార్కెటింగ్ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం జిల్లా నుంచి పేపర్ పరిశ్రమలకు 5 వేల టన్నుల వరకు రోజువారి డిమాండ్ ఉన్నా రోజుకు కనీసం 2 వేల టన్నుల కర్ర కూడా సరఫరా కావడం లేదు. ఈ ప్రాంతం నుంచి శ్రీకాళహస్తిలోని గ్రీన్‌ప్లే పేపర్ పరిశ్రమతో పాటు, తెలంగాణలోని ఐటీసీ కంపెనీలకు సరఫరా అవుతుంది. కానీ నెల్లూరు జిల్లా నుంచి గ్రీన్‌ప్లే పరిశ్రమకు ఎక్కువగా వెళ్తుంది. వీటితో పాటు బద్వేల్‌లోని సెంచరీ, నాయుడుపేటలోని గ్రీన్‌ల్యామ్, వస్మీన్ పరిశ్రమలు, తడ వద్ద ఉన్న సెరామ్‌ప్లే, కందుకూరులోని రంగా పార్టికల్ బోర్డు పరిశ్రమకు కర్ర సరఫరా అవుతోంది. ఈ కంపెనీలు భారీగా విస్తరణ చేపడుతుండడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా 7 వేల టన్నుల వరకు రోజుకు కర్ర అవసరం అవుతుంది. వీటిలో గ్రీన్‌ప్లేకు 3,500 టన్నులు, సెంచరీ, గ్రీన్‌ల్యామ్ కంపెనీలకు 1,500 టన్నులు, రంగా పార్టికల్ బోర్డు, వస్మీన్, సెరామ్‌ప్లైకి 500 టన్నుల చొప్పున రోజువారీ డిమాండ్ ఉంది.

గతంలో రూ.1,600

జామాయిల్ కర్ర ధర ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. గతంలో టన్ను రూ.1,600 ఉన్న కర్ర ధర ప్రస్తుతం రూ.3,700 వరకు చేరింది. రైతు పొలంలో నిలువు చెట్టు మీదే ఈ ధర పలుకుతుంది. అలాగే సరుగుడు తోట ఎకరాకు రూ.3 లక్షల వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న కొరత దృష్ట్యా ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కర్ర ధరలు విపరీతంగా పడిపోయాయి. టన్నుకు కనీసం రూ.1600 కూడా లభించని పరిస్థితి. రైతు సంఘాలు అప్పట్లో ఈ ధరలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాయి. అయినా ప్రయోజనం లేకపోవడంతో రైతులు జామాయిల్ సాగును క్రమంగా తగ్గించి ఇతర పంటల వైపు వెళ్లారు. ప్రధానంగా జామాయిల్ అత్యధికంగా సాగయ్యే కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో సాగు తగ్గిందని భావిస్తున్నారు.

భవిష్యత్‌లో ధరలు మరింత పెరుగుతాయి

ప్రస్తుతం పేపర్ పరిశ్రమల డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేదు. జిల్లా నుంచి వచ్చే నాణ్యత బాగుండడం వల్ల ఇక్కడి కర్రకు డిమాండ్ ఉంటుంది. దీని వల్ల ధరలు పెరుగుతున్నాయి. పరిశ్రమల కార్యకలాపాలు దృష్ట్యా భవిష్యత్‌లో కూడా కర్రకు డిమాండ్ పెరుగుతుంది.

– శ్రీనివాసులు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, ఏఎంసీ

కిడ్నాప్ చేసి.. ఆపై గొంతు కోసి

నెల్లూరు(క్రైమ్) : ఓ యువకుడిని కిడ్నాప్ చేసి ఆపై గొంతుకోసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రొట్టెల పండగ సందర్భంగా గతనెల 30వ తేదీ అర్ధరాత్రి కోటమిట్ట నుంచి బారాషహీద్ దర్గాకు గంధం ఊరేగింపుగా బయలుదేరింది. ఈ కార్యక్రమంలో కోటమిట్టకు చెందిన సయ్యద్ షాబుల్ అహ్మద్ తన స్నేహితులతో కలిసి పాల్గొన్నారు. మధ్యలో షాబుల్ అహ్మద్ స్నేహితుడు సాజిద్‌కు అదే ప్రాంతానికి చెందిన మహేష్ మరికొందరితో వివాదం జరిగింది. అందరూ సర్ది చెప్పడంతో వివాదం సర్దుమణిగింది. 31వ తేదీ తెల్లవారుజామున సాజిద్ ఇంటికి వెళ్తుండగా కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల సమీపంలో మహేష్ అతని స్నేహితులైన ముత్తు, బాషా, భాస్కర్, ఫైరజ్ అడ్డగించారు. సాజిద్‌ను వారు బైక్‌పై బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్తుండటాన్ని షాబుల్ అహ్మద్ గమనించి వారిని వెంబడించారు. వారు వేగం పెంచి నరసింహకొండకు వెళ్లారు. అక్కడ సాజిద్ గొంతుకోశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న షాబుల్ అహ్మద్ పెద్దగా అరవడంతో నిందితులు పరారయ్యారు. గాయాలపాలైన సాజిద్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం తొలుత జీజీహెచ్‌కు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం సాజిద్ పరిస్థితి నిలకడగా ఉంది. ఈమేరకు షాబుల్ అహ్మద్ సోమవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేద్దాం



డీవార్మింగ్ డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట) : ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం డీవార్మింగ్ డేకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు ఆల్‌బెండాజోల్ 200 మిల్లీ గ్రాములు, మూడు నుంచి 19 ఏళ్లలోపు వారికి 400 మిల్లీ గ్రాముల మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మాత్రలను మధ్యాహ్న భోజనం తర్వాత వేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్న 5,26,399 విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను అందించేలా వైద్యారోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక బృందాలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీ ఆరోగ్యశ్రీ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'భార్య, అత్త వేధిస్తున్నారు'



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా, తల్లిదండ్రులు

కావలి : భార్య, అత్త కలిసి తనను వేధిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని భర్త పోలీసులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రెండో వార్డు ఇస్లాంపేటకు చెందిన ఖాదర్‌బాషా తన తల్లిదండ్రులతో కలిసి స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. కావలికి చెందిన జమీలకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, ఆమె భర్త ఎలాంటి పనులు చేయలేక మంచాన ఉన్నాడన్నారు. దీంతో జమీల విజ్ఞప్తి మేరకు ఆమె కుమార్తె రేష్మాను రూపాయి కట్నం తీసుకోకుండా వివాహం చేసుకున్నట్లు తెలిపారు. జమీల కుమార్తె 13 ఏళ్లు బాగానే ఉందని, అనంతరం వారి కుటుంబసభ్యులను తన ఇంటికి తీసుకొచ్చి తనపై, తన కుటుంబసభ్యులపై దాడులు చేయిస్తోందని ఆరోపించారు. వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

నెల్లూరు(క్రైమ్) : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. క్రాంతినగర్‌లో ఆర్.అనిల్‌కుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన గతనెల 30వ తేదీ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన అవ్వను చూసేందుకు కుటుంబంతో కలిసి వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.1.50 లక్షల విలువచేసే 30 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన బాధితులు తలుపులు తెరచి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈమేరకు బాధితులు మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(పొగతోట) : జిల్లాలో ఖాళీగా ఉన్న 179 గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి ఈనెల 2వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓలు 2వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ల స్వీకరణ, 5న పరిశీలించి 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 9న నియామక ఆర్డర్స్ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు https://gramawardsachivalayam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు.

కసుమూరులో భక్తుల రద్దీ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



క్యూలైన్లో వెళ్తున్న భక్తులు

వెంకటాచలం : మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాను మంగళవారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కసుమూరులో రద్దీ కొనసాగింది. భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. దర్గాలో భక్తులు ప్రార్థనల అనంతరం చందనమహల్, చెరువుకట్ట, దర్గా సమీపంలో పొలాల వద్ద భక్తులు సేదతీరారు.